క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని సీఆర్ కాలనీ, రజకకాలనీ, ఏఎంజీ డొంక పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రెండు గ్రామాల్లో ముమ్మర తనిఖీలు



నాదెండ్ల: సమస్యాత్మక గ్రామాలైన చందవరం, కనపర్రు గ్రామాల్లో సోమవారం పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మారణాయుధాలు, పెట్రోల్ బాంబులు వంటి వాటిని గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి, సిబ్బందితో కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు.

నాదెండ్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అఫ్రీఫున్నిసా బేగం



నాదెండ్ల: నాదెండ్ల మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా షేక్ అఫ్రీఫున్నిసా బేగం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రస్తుతం యడ్లపాడు మండలం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో తప్పిదాల కారణంగా తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఏఈఆర్వోగా అఫ్రీఫున్నిసా బేగంకు బాధ్యతలు అప్పగించారు. సోమవారం నుంచి నాదెండ్ల మండల రెవెన్యూ బాధ్యతలు అప్పగించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



బొల్లాపల్లి : బంజార జాతుల అభివృద్ధికి పాటుపడుదామని ఆల్ ఇండియా బంజారా సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు జాటావత్ రాంబాబునాయక్ అన్నారు. మండలంలోని రాజానాయక్ తండాలో బంజార విద్యార్థులకు ఉపకార వేతనాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పదో తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన 45 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున అందజేయడం జరిగిందని రాంబాబు తెలిపారు. ప్రతి సంవత్సరం పేద బంజార విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి దాతల సహకారాన్ని అందుకొని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బంజార సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మోర్జంపాడులో పోలీసుల తనిఖీలు

మాచవరం: పోలింగ్ అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మోర్జంపాడు గ్రామంలో మంగళవారం ప్రత్యేక పోలీస్ బలగాలతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామంలో సరైన పత్రాలు లేని 12 అనుమానిత ద్విచక్ర వాహనాలను గుర్తించినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ తెలిపారు. వాహన యజమానుల నుంచి వాటి వివరాలను తెలుసుకొని, రికార్డు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

విజయపురిసౌత్ ఎస్ఐగా పట్టాభి రామయ్య



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.పట్టాభి రామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు విజయపురిసౌత్ ఎస్ఐగా పనిచేసిన డి.వి.కొండారెడ్డి ఎన్నికల్లో పలు ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ పట్టాభి రామయ్య మాట్లాడుతూ విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పట్టాభి రామయ్యను ఏఎస్ఐలు సోమ్లా నాయక్, రామకృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సాంబ నాయక్, కానిస్టేబుల్ సురేష్ తదితరులు అభినందించారు.

మట్టి కుప్పలను వెంటనే తొలగించండి

పట్టణంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనరు



డెయినేజీలో పూడిక తీస్తున్న దృశ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనరు

నరసరావుపేట: రోడ్లపై ఉన్న మట్టి, కాలువ నుంచి తీసిన పూడిక కుప్పలను వెంటనే తొలగించి పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎనిమిదవ వార్డు ఇస్లాంపేట, వినుకొండ రోడ్డు, పెద్ద చెరువు, పల్నాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. వినుకొండ రోడ్డులోని హాస్పిటల్ వద్ద దాని నుంచి వచ్చే డ్రెయినేజీ మురుగు నీరు రోడ్డుపైకి వదలడం వలన అక్కడ నీళ్లు ఆగి మురికిగుంటలా తయారుకావడం పరిశీలించారు. సంబంధిత యాజమాన్యాన్ని పిలిపించి వెంటనే వారం వ్యవధిలో ఈ సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

- భూమికి బలం... రైతుకు రొక్కం
- కంపోస్ట్ ఎరువులతోనూ నాణ్యమైన దిగుబడి
- సేంద్రియ ఎరువుపై రైతులకు పెరిగిన ఆసక్తి



రెంటచింతల శివారులోని పొలంలో జీవాల మందతో పొలానికి ఎరువు చేరుస్తున్న దృశ్యం

రెంటచింతల: సహజ సిద్ధంగా ప్రకృతిలోని వ్యర్థాల నుంచి తయారయ్యేవే సేంద్రియ ఎరువులు. మొక్కలు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, ఇతర జంతువుల వ్యర్థాల నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువులను వినియోగించడం వలన భూమికి ఎంతో బలం. దీంతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చి ఎక్కువ ఆదాయం వస్తుంది. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన పెరిగింది.

- ఈ సేంద్రియ ఎరువులను భూమికి అందించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని, ఈ ఎరువుల వినియోగం వలన వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని రైతులు భావిస్తున్నారు.
- ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో రైతన్నలు తమ పంట పొలాలకు సేంద్రియ ఎరువులను వినియోగించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.
- రసాయనిక ఎరువుల వాడకం వలన పెట్టుబడులు పెరగడంతో పాటు వేసిన పంటలకు అనేక రకాల చీడలు వ్యాపిస్తున్నాయి.
- సేంద్రియ ఎరువుల వాడకం వలన తక్కువ ఖర్చుతోపాటు భూమికి బలం... మెరుగైన దిగుబడులు రావడంతో అన్నదాతలు సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.
- రైతులు అనాదిగా పొలాలకు పశువుల ఎరువును వినియోగిస్తున్నారు. అయితే వ్యవసాయంలో నూతన యాంత్రీకరణ పద్ధతులు రావడంతో గ్రామాల్లో పశువుల సంతతి తగ్గిపోయి రైతన్నలకు పశువుల ఎరువు అందుబాటులో లేకుండా పోయింది.
- పంటలకు ఉపయోగించే ఎరువుల్లో పశువుల ఎరువు చాలా ముఖ్యమైంది. సాగు చేస్తున్న పంటలకు పోషకాలను అందించడంతో పాటు పొలంలో కురిసిన వర్షపు నీటిని ఒడిసి పట్టి పంటలకు అందించడంలో పశువుల పేడ కీలక పాత్ర పోషిస్తుంది.
- పొలాల్లో వేస్తున్న ఎరువులను పంటలకు అందించాలన్నా ఈ ఎరువు తరువాత ఏదైనా పశువుల ఎరువును పొలంలో చిన్న చిన్న కుప్పలుగా పోసి తొలకరి వర్షాలు కురిసిన వెంటనే కుప్పలుగా పోసిన ఎరువును పొలం అంతా చిమ్ముకోవాలి. అప్పుడే ఎరువులోని పోషకాలు భూమికి పుష్కలంగా అందుతాయి.
- గ్రామాల్లో లభించే చెత్త, ఆకులు, ఇతర కలుపు మొక్కలు, కుళ్లిన కూరగాయలు, వేరుశనగ కాయల పొట్టు, పశువుల పేడ, మూత్రంతో కుళ్లింపజేస్తే.. అది కంపోస్టు ఎరువుగా తయారవుతుంది. ఇది పంటలకు వేస్తే మొక్కలు బలంగా ఏపుగా పెరగడంతో పాటు పంటకు చీడపీడలు సోకవు. దీంతో మంచి దిగుబడి వస్తుంది.
- కోళ్ల ఫారాల్లో కోళ్ల కింద వేసిన పొట్టు మలమూత్రాలతో కలిపి కుళ్లిన మలం సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. ఈ కోళ్ల ఎరువులో 3 శాతం నత్రజని, 2 శాతం భాస్వరం, 2 శాతం పొటాష్ పోషకాలు ఉంటాయి. తేమ తగ్గేకొద్దీ పోషక శాతం పెరుగుతుంది.

సేంద్రియ ఎరువులకు గిరాకీ పెరిగింది



ప్రస్తుతం గ్రామాల్లో రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువులు వేసేందుకు మొగ్గు చూపడంతో సేంద్రీయ ఎరువులకు గిరాకీ బాగా పెరిగింది. సేంద్రియ ఎరువులు వినియోగించడం వలన రెండు, మూడు సంవత్సరాల పాటు పంటలకు పోషకాలు లభిస్తాయి. రైతులు పంటలకు రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వలన పెట్టుబడి అధికం... ప్రయోజనం తక్కువ.

– బాపనపల్లి రాజు, కౌలు రైతు, రెంటచింతల

జీవాల పెంపకం భారమైపోతోంది



ప్రస్తుతం అన్ని రకాలుగా పెరిగిన ధరల కారణంగా జీవాల పెంపకం భారమైపోయింది. నాకున్న 150 జీవాలతో ఎకరం పొలంలో ఒక రాత్రి మంద చేరిస్తే రూ.1,800 నుంచి రూ.1,900 ఇస్తారు. దీనిలో మందకు కాపలా ఉన్న ముగ్గురు కూలీలకు రూ.900 ఇవ్వాల్సి ఉంది. జూన్ నుంచి నవంబర్ వరకు అడవులలో జీవాలు తిరగడం వలన ఖర్చు ఉండదు. డిసెంబర్ నుంచి మే నెల వరకు ఒక్కొక్క గొర్రెకు రోజుకు రూ.20 ఖర్చు వస్తుంది.

– పెరుమాళ్ళ ఊశయ్య , జీవాల యజమాని, సుబ్బారెడ్డి పాలెం, మాచర్ల మండలం

సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాం



గ్రామాలలో పలు రకాల పంటలను సాగుచేసే రైతులను సేంద్రీయ ఎరువుల వాడే విధంగా ప్రోత్సహిస్తున్నాం. సేంద్రియ ఎరువుల వలన భూమికి అనేక పోషకలవణాలు పుష్కలంగా అందడంతో మొక్క లు బలంగా పెరిగి అధిక దిగుబడులను సాధించవచ్చు. గ్రామాలలో పశువుల ఎరువుల కొరత కారణంగా కంపోస్ట్ ఎరువు తయారిపై రైతులకు అవగాహన కల్పించడం వలన రసాయనిక ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గిస్తున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుంది.

– బోయపాటి బ్రహ్మారెడ్డి, ఏవో, రెంటచింతల

కొరబండి కృషి అభినందనీయం



కొరబండి ఆంథోని దంపతులను సత్కరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: సమాజంలో దాగి ఉన్న రుగ్మతలను రూపుమాపటంతో పాటు దళితులను చైతన్య వంతులను చేయటంలో కొరబండి ఆంథోని కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ విశ్రాంత టీఐ-2 అధికారి కొరబండి ఆంథోని 70వ జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకల్లో పలువురు మాట్లాడారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క సామాజిక రుగ్మతలతో పాటు దళితులను చైతన్య వంతులను చేయడానికి ఆంథోని కృషి చేసేవారని కొనియాడారు. దళిత ఉద్యమ నేత కత్తి పద్మారావుకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ ఆయన ప్రతి పోరాటంలో ఆంథోని కీలకంగా ఉండేవారన్నారు. అనంతరం ఆంథోని, విజయలక్ష్మి దంపతులను పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొరబండి ఆంథోని మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని అనుసరించి బహుజనులు రాజ్యాధికారం దిశగా పయనిస్తూ ఆత్మగౌరవంతో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు దావులూరి కోటేశ్వరరావు, జిల్లెళ్ల పాల్ రాజ్, ఉపాధ్యాయులు మాతంగి సాంబశివరావు, జడ ప్రసాద్, తలతోటి కోటేశ్వరరావు, కోట ఆనంద్, కొరబండి కిషోర్, క్రాంతి, రాంబాబు, జెట్టి శేఖర్ తదితరులున్నారు.

నేడు కళానిలయంలో కూచిపూడి నృత్య పోటీలు

చిలకలూరిపేట: కళానిలయం జాతీయ స్థాయి 39వ సంగీత,నాట్య, కళారూపాల పోటీలు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణమండపంలో మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజు సూర్య విభాగంలో ఐదు నుంచి 13 సంవత్సరాల లోపు వారికి కూచిపూడి, సూర్య విభాగం ఏ గ్రూపులో 14 సంవత్సరాలు పైబడిన వారికి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు.

కారెంపూడిలో కొనసాగుతున్న బందోబస్తు

కారెంపూడి: కారెంపూడిలో భారీ బందోబస్తు కొనసాగుతోంది. సోమవారం మండలంలో ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోలేదు. 14వ తేదీ నుంచి కొనసాగుతున్న 144 సెక్షన్ యథావిధిగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. దుర్గి మండలం అడిగొప్పల అమ్మవారి గుడికి వెళ్లే భక్తులతో కారెంపూడిలో ఆదివారం జనసంచారం ఎక్కువగా కనిపించింది. షాపులు కూడా తెరుచుకున్నాయి. కానీ సోమవారం ఉదయం 10 గంటల వరకు మాత్రమే షాపులు తీశారు. ఆ తర్వాత షాపులన్నీ మూతపడటంతో యథావిధిగా నిర్మానుష్య వాతావరణం చోటు చేసుకుంది. పోలీస్ పహారాలో కారెంపూడి మొత్తం ఉండిపోయింది. గ్రామ శివార్లలో యథావిధిగా పోలీస్ చెక్ పోస్టులలో కారెంపూడికి వచ్చే వాహనాలు ఇతరుల రాకపోకలను నిశితంగా తనిఖీ చేశారు.

పీఎంసీ వర్క్‌షాపుకు ఆర్పీలుగా 75 త్యాళ్లూరు ఉపాధ్యాయులు



పీఎంసీ వర్క్‌షాపులో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు

పెదకూరపాడు: పీఎంసీ పాఠశాలలకు జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ప్రారంభమైన కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపుకు పల్నాడు జిల్లా నుంచి రిసోర్స్ పర్సన్‌లుగా 75 త్యాళ్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల మండలం సాతులూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావులు వ్యవహరించారు. ఈ వర్క్‌షాపు ఈ నెల 22 వరకు జరుగుతుందని శ్రీనివాసరెడ్డి వివరించారు. వర్క్‌షాపులో ఉభయ రాష్ట్రాల విద్యా శాఖ ఉన్నతాధికారులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారని, పాఠశాలలకు అవసరమైన సూచనలు, సలహాలను అందించామని తెలిపారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలలో భాగంగా జీలుగతో తమ వ్యవసాయ భూములను సారవంతం చేసుకోవాలని ఆయన సూచించారు. పచ్చిరొట్ట పంటను భూమిలో కలియదున్నితే భూమి సారవంతమై వివిధ పోషకాలతో సమతుల్యత కలిగి ఉండి మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. జీలుగ విత్తనాలు కేజీ రూ.44కు అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఆయా గ్రామాలలోని గ్రామ సేవకులను, రెంటచింతల మండల వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దుదాం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ప్రతి వాడలోను పెద్దలను, మహిళలను కలిసి అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలని కోరుతూ, ప్రజలకు భరోసా ఇస్తూ సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంపై సీఐ కల్యాణ్ రాజ్ మాట్లాడుతూ తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రజలకు అప్రమత్తం చేసేందుకు ప్రతి ప్రాంతంలో తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారన్నారు. తాడేపల్లి రెండు మహానగరాల మధ్య ఉండడం, శరవేగంగా అభివృద్ధి చెందడం, పలు కళాశాలలు ఉండడంతో యువతీ యువకులు ప్రతిరోజు వస్తున్నారని, అందులో కొంతమంది అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నారని తమకు సమాచారం ఉందన్నారు. ప్రజల కళ్లముందు జరుగుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మాకెందుకులే అనుకుంటున్నారని వివరించారు. చివరకు అక్కడ వున్న ప్రజలే ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తుగా అక్కడ వున్న ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు ఏ విధంగా ప్రవర్తిస్తారు? వారిని మనం ఏ విధంగా గుర్తించాలి? వారి గురించి పోలీసులు ఏ విధంగా సమాచారం ఇవ్వాలనే అంశాన్ని వివరిస్తున్నామని వివరించారు.

పుస్తక పఠనంతో విలువైన జ్ఞానం



నాదెండ్ల గ్రంథాలయంలో చిన్నారులను చదివిస్తున్న హెచ్ఎం సాంబశివరావు

నాదెండ్ల: పుస్తక పఠనంతో చిన్నారులు, యువతకు విలువైన జ్ఞానం లభ్యమౌతుందని నాదెండ్ల శివాలయం వీధి ఎంపీపీఎస్ హెచ్ఎం మద్దుల సాంబశివరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని సోమవారం ఆయన ప్రత్యేక అతిధిగా పాల్గొన్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాల పఠనానికి కొంత సమయాన్ని వెచ్చించి జ్ఞానవంతులుగా రూపొందాలని సూచించారు. గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రతిరోజూ విద్యార్థులకు రాయటం, చదవటం, చదివించటం, గణితం, తెలుగు, ఇంగ్లీష్ తదితర అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో శిక్షణనిస్తామన్నారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఆదివారం హాజరైన చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. చివరి రోజుల చిన్నారులందరికీ బహుమతులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

వాహనం ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు



గణపవరంలో ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న సీఐ శ్రీరామ్

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం వద్ద ద్విచక్రవాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురికి స్వల్పగాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. చిలకలూరిపేట వడ్డెరకాలనీకి చెందిన ఉప్పు హనుమంతరావు, ఆయన కుమారుడు హేమంత్‌కుమార్‌తో కలిసి గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపునకు వెళ్తున్నాడు. అదే సమయంలో గణపవరం జంక్షన్ వద్ద టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం ధ్వంసం కాగా, తండ్రీ కొడుకులు గాయాలపాలయ్యారు. ఇదే సమయంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న సీఎం సెక్యూరిటీ సీఐ శ్రీరామ్ కారులో వెళ్తూ ప్రమాదాన్ని గుర్తించి వాహనాన్ని నిలిపారు. ప్రమాదంపై నాదెండ్ల ఎస్సై బలరామ్‌కు సమాచారం అందించారు. దీంతో నేషనల్ హైవే పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదానికి కారణమైన టాటా ఎస్ వాహనాన్ని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ కోర్సులు



మాచవరంలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌మీడియట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ-2 శ్రీధర్, హెచ్ఎం కె.సురేష్ బాబు సోమవారం తెలిపారు. ఈ ఏడాది హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని, అందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్ కో-ఎడ్యుకేషన్ ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, సీఈసీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. పీజీ అర్హత కలిగిన ఉపాధ్యాయులచే ఐఎఫ్‌పీల ద్వారా ఆధునిక పద్ధతిలో విద్యాబోధన, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌ల సదుపాయాలతో వ్యక్తిత్వ వికాస శిక్షణలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, మండల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసేందుకు ఉపాధ్యాయ బృందంతో కాంపెయిన్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

యువతకు ఆదర్శప్రాయుడు సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అమరావతి: శ్రామిక, పీడిత వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అమరావతి శాఖ కార్యదర్శి షేక్ మొహిద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తుదిశ్వాస వరకు పేద ప్రజల కోసం సామ్యవాద సమసమాజం కోసం నిస్వార్థంగా, నిరాడంబరంగా జీవించారన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా కార్మిక కర్షకుల సంక్షేమం కోసం ఆర్థిక సామాజిక అంశాలపై అధ్యయనం చేసి చట్టాలను రూపొందించటంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి లక్షల ఎకరాల భూమిని రైతు కూలీలకు పంపిణీ చేయటానికి కారకుడైనారన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన సుందరయ్య ఆశయాలు ఆదర్శాలకు అనుగుణంగా నేటి యువత ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉగాది జ్ఞాన బుద్ధ పురస్కారాలు ప్రదానం



పురస్కారం అందుకుంటున్న రవికుమార్



పురస్కారం అందుకుంటున్న సరికొండ రమాదేవి

సత్తెనపల్లి: తెలుగు వెలుగు సాహితీ వేదిక ప్రకాశం జిల్లా ఒంగోలులోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 19న ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా, మహారాష్ట్రల స్థాయిలో విద్యా, సమాజ సేవ, వైద్యం, కోలాటం భజన, రంగస్థలం పౌరాణిక కళా సేవా రంగాల్లో ప్రావీణ్యం గడించిన 150 మందికి జ్ఞాన బుద్ధ, మయూరి, నంది పురస్కారాలను ప్రదానం చేశారు. దీనిలో భాగంగా సత్తెనపల్లికి చెందిన రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి ఉగాది జ్ఞాన బుద్ధ పూర్ణ పురస్కారం, వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు జ్ఞాన బుద్ధ జాతీయ పురస్కారాలు అందించి సత్కరించారు. పురస్కారాలు అందుకున్న డాక్టర్ సరికొండ రమాదేవి, బెజగం రవికుమార్‌లను స్థానికులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

కారెంపూడి ఎస్ఐగా అమీర్

కారెంపూడి: కారెంపూడి ఎస్ఐగా కేఅమీర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రామాంజనేయులు 15వ తేదీన సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో పిడుగురాళ్లలో ఎస్ఐగా పనిచేస్తున్న కే అమీర్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమితులయ్యారు.